క్లుప్తంగా

నేటి నుంచి స్కాట్స్ అండ్ గైడ్స్ శిబిరం



నాదెండ్ల: ఇర్లపాడు కేంద్రియ విద్యాలయలో ఈ నెల 1 నుంచి 4వ తేదీ వరకూ భారత స్కాట్స్ అండ్ గైడ్స్ నాలుగు రోజుల పాటూ నిర్వహిస్తున్న తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంప్ 2025 నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ నీరజ్‌కుమార్ శ్రీవత్స తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని 35 కేంద్రీయ విద్యాలయాల నుంచి స్కాట్స్ అండ్ గైడ్స్ హాజరుకానున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో అంకితభావం, సేవాతత్పరత, వివిధ నైపుణ్యాలు పెంపొందించటంతో ఈ శిబిరం దోహదపడనుందని తెలిపారు. ముగింపు కార్యక్రమానికి వివిధ రంగాల ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు.

ప్రజా రవాణాలో డ్రైవర్లు కీలక పాత్ర



నరసరావుపేట రూరల్: ప్రజా రవాణాలో డ్రైవర్లు కీలక పాత్ర అని జిల్లా రవాణా అధికారి జి.సంజీవ్‌కుమార్ తెలిపారు. డాక్టర్ రామలింగారెడ్డి మాక్స్ విజన్ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో జిల్లా రవాణా అధికారి కార్యాలయంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని జిల్లా రవాణా అధికారి సంజీవ్ కుమార్ ప్రారంభించారు. శిబిరంలో 75 మంది డ్రైవర్లు, కార్యాలయ సిబ్బందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంజీవ్ కుమార్ మాట్లాడుతూ డ్రైవర్లు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని తెలిపారు. చెడు అలవాట్లుకు స్వస్తి పలికి సేవా దృక్పథం అలవర్చుకోవాలని సూచించారు. ట్రాఫిక్ రూల్స్ ఖచ్చితంగా పాటించడం వలన ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంవీఐ మనీషా, వంశీకృష్ణ, మాక్స్ విజన్ హాస్పిటల్ కోఆర్డినేటర్ వీరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నూజెండ్ల ఎంఈవోగా సత్యనారాయణ

నూజెండ్ల: మండల విద్యాశాఖాధికారి-1గా కాకర్ల సత్యనారాయణ గురువారం స్థానిక ఎంఇవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. విద్యాశాఖలో ఇటీవల జరిగిన బదిలీలు, పదోన్నతుల్లో భాగంగా సంతమాగులూరు జెడ్‌పి పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న సత్యనారాయణ పదోన్నతిపై రావటం జరిగింది. ఇప్పటి వరకూ ఇన్‌చార్జ్‌గా పనిచేసిన శావల్యాపురం ఎంఇవో సాంబశివరావు తమ మండలంలో బాధ్యతలు నిర్వర్తిస్తారు. ఎంఇవో-2గా పనిచేస్తున్న రవిచంద్ర ఎప్పటిలా విధుల్లో కొనసాగనున్నారు.

ఘనంగా ఇగ్నేషియస్ పండుగ

వినుకొండ: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని జీవాలయంలో గల లయోలా ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో పునీత లయోలా ఇగ్నేషియస్ వారి పండుగను ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ ఆంటోని ప్రసాద్ ఇగ్నేషియస్ విగ్రహానికి పూలమాల వేసి వేడుకలను ప్రారంభించారు. ఇగ్నేషియస్ చేసిన సేవలను గురించి కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలశౌరయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హైర్‌బస్సు డ్రైవర్స్ అండ్ వర్కర్ యూనియన్ వార్షికోత్సవం

వినుకొండ: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో హైర్ బస్సు డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ 10వ వార్షికోత్సవ వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ వేడుకలకు ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పాల్గొని కేక్ కట్ చేసి మాట్లాడుతూ ప్రజా రవాణా వ్యవస్థలో హైర్ బస్సు డ్రైవర్లు, కార్మికుల సేవలు అమూల్యమైనవని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నాగశ్రీను రాయల్, యూనియన్ ప్రెసిడెంట్ కె.సుబ్రహ్మణ్యం, సెక్రటరీ ఎస్‌కే సైదుబాబు, చైర్మన్ రమణారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ జి. శ్రీను, ప్రచార కార్యదర్శిదోరడ్ల నాసర్‌బాబు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చిలకలూరిపేట టౌన్: కుటుంబ కలహాల నేపథ్యంలో వ్యక్తి బలవన్మరణం గోపాల్ పాడిన సంఘటన పట్టణంలో జరిగింది పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... స్థానిక సుబ్బయ్య తోటలో నివాసముండే నున్నా నాగేశ్వరరావు (61) గతంలో పత్తి వ్యాపారం చేసి ప్రస్తుతం ఖాళీగానే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం భార్యతో చిన్నపాటి గొడవ జరగడంతో మనస్థాపన చెందిన నాగేశ్వరరావు నరసరావుపేట సెంటర్లోని అద్దెకు ఇచ్చిన తమ షాపు కు చేరుకొని స్టోర్ రూమ్ లా ఉపయోగించుకునే గదిలో పురుగుల మందు సేవించాడు. ఆత్మహత్యకు ముందుగా లండన్ లో ఉంటున్న తన కుమార్తెకు ఫోన్ చేసి జాగ్రత్తలు చెప్పాడు. దీంతో ఆమె షాప్ అతనికి ఫోన్ చేసి చెప్పగా అక్కడికి వచ్చిన అతను తలుపు తీసి చూడగా అపస్మారక స్థితిలో కనిపించాడు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కుమార్తె శిరీష ఫిర్యాదు మేరకు అర్బన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు

గణపవరం జెడ్పీ హైస్కూలుకు మహర్దశ

- రూ.40 లక్షలతో నాలుగు వైపులా 8 అడుగుల ఎత్తున ప్రహరీ నిర్మాణం
- దాతలు, ఉపాధ్యాయులు, పూర్వవిద్యార్థుల సహకారంతో..
- పదోతరగతి ఫలితాల్లోనూ ముందంజ



గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల

నాదెండ్ల: గ్రామీణ ప్రాంతాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రత్యేక స్థానం ఉంది. ఈ గ్రామం పారిశ్రామిక కేంద్రం కావటంతో పలు రకాల పరిశ్రమలు ఉన్నాయి. ఇందులో పనిచేసే వేలాది మంది కార్మికులు ఒడిషా, బీహార్, చత్తీస్‌ఘడ్, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వలస వచ్చి ఆయా పరిశ్రమల్లో పనిచేస్తుంటారు. వీరి పిల్లలు ఎక్కువగా ఈ పాఠశాలలో చదువుతుంటారు. 2020-21లో సుమారు 1100 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేశారు. ప్రస్తుతం 2025-26లో 825 మంది విద్యార్థులు చదువుతున్నారు. 1975లో ఈ పాఠశాల నూతన భవనాలతో ప్రారంభమైంది.

2007-08 నుంచి ట్రిపుల్‌ఐటీ ప్రారంభం కాగా ఈ ఏడాది వరకూ సుమారు 50 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఈ ఉన్నత పాఠశాలకు ఇప్పటి వరకూ ప్రహరీ లేకపోవటంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయమైంది. రాత్రివేళల్లో పాఠశాల ప్రాంగణంలోనే ఆకతాయిలు మద్యం తాగుతూ హంగామా సృష్టిస్తున్నారు. దీంతో దాతలు, పూర్వ విద్యార్థులు సుమారు రూ.40 లక్షల వ్యయంతో పాఠశాలకు నాలుగు వైపులా 8 అడుగుల ఎత్తున ప్రహరీ, ఆర్చ్‌లు, రెండు కల్వర్టులు, విద్యార్థులకు వాకింగ్ ట్రాక్, బాలురు, బాలికలకు విడివిడిగా జిమ్ సౌకర్యాలు కల్పించేందుకు నడుం బిగించారు.

జగనన్న హయాంలో రూ.2 కోట్లతో అభివృద్ధి

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మనబడి నాడు నేడు ద్వారా ఫస్ట్ ఫేజ్‌లో రూ.84.5 లక్షలు మంజూరు చేయటంతో పాఠశాలలో గ్రానైట్ ఫ్లోరింగ్, ప్రతి క్లాసు రూములకు ఫ్యాన్లు, గ్రీన్ బోర్డులు, బెంచీలు, విద్యుత్ వైరింగ్, మరమ్మతులు తదితర పనులు నిర్వహించారు. రెండో ఫేజ్‌లో పది అదనపు గదుల నిర్మాణానికి రూ.1.20 కోట్లు మంజూరుకాగా, ఎనిమిది గదులు నిర్మించారు. రూ.90 లక్షల మేర పనులు జరిగాయి. సార్వత్రిక ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి.





కొనసాగుతున్న ప్రహరీ నిర్మాణ పనులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు ముందుకు సాగలేదు. ఇప్పటి వరకూ మిగిలిన పనులు పూర్తి కాకపోగా, పాఠశాలకు కావలసిన ప్రహరీ నిర్మాణానికి అనుమతులు మంజూరు కాలేదు. దీంతో గ్రామానికి చెందిన పలువురు దాతలు, పూర్వ విద్యార్థులు నిధులు సమకూర్చుకుని నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రహరీ నిర్మాణం పూర్తయితే పాఠశాల రూపురేఖలే మారనున్నాయని పలువురు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అందరి సహకారంతో..



కెల్లంపల్లి భద్రాచలం మా తాతగారు. గ్రామంలో హైస్కూలు నిర్మాణానికి 1973లో భూమిని దానం చేశారు. ఈ హైస్కూలులో వేలాది మంది విద్యార్థులు చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదిగారు. ప్రహరీ నిర్మాణానికి నా వంతుగా రూ.5 లక్షలు, మా బంధువులైన కారుమంచి ప్రసాద్, కొంగర మల్లేశ్వరరావులు రూ.9 లక్షలు విరాళంగా అందించాం. అంతేకాక పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆర్థికసాయంతో ప్రహరీ, పలు ఇతర పనుల నిర్మాణం ప్రారంభమైంది.

–మున్నంగి శ్రీనివాసరావు,
పాఠశాల వంశపారంపర్య ధర్మకర్త

పరీక్ష కేంద్రానికి లైన్ క్లియర్



గతంలో ఈ పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేశా. తిరిగి ఇక్కడే బదిలీపై వచ్చా. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అతిపెద్ద పాఠశాలల్లో ఇది ఒకటి. పాఠశాలకు ప్రహరీ లేకపోవటంతో పదో తరగతి పరీక్షల నిర్వహణకు అనుమతి రావడం లేదు. ఈ ప్రహరీ నిర్మాణం పూర్తయితే 2025-26 విద్యా సంవత్సరానికి పదో తరగతి పరీక్షా కేంద్రానికి అనుమతి వచ్చే అవకాశం ఉంది.

–ఐ కృష్ణానాయక్, హెచ్‌ఎం, జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ మండలి కార్యదర్శి.

కొండవీడు ఆస్పత్రిలో అరుదైన ఆపరేషన్

జిల్లాలో తొలిసారిగా చేశామంటున్న డాక్టర్ జగన్‌మోహన్ రెడ్డి



పేషెంట్‌కు ఆపరేషన్ చేస్తున్న డాక్టర్లు

నరసరావుపేట: స్థానిక కొండవీడు ఇఎన్‌టీ హాస్పిటల్‌లో పల్నాడు జిల్లాలోనే తొలిసారిగా బెలూన్ ట్యూబా ప్లాస్టీ ఆపరేషన్ విజయవంతంగా నిర్వహించినట్లు డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం వివరాలు మీడియాకు తెలియచేశారు. కురిచేడు మండలం వీరయ్యపాలెం గ్రామానికి చెందిన 50 ఏళ్ల ఎస్.రామ కోటేశ్వరమ్మకు బెలూన్ ట్యూబో ప్లాస్టీ ఆపరేషన్ ద్వారా చెవి నుంచి ముక్కుకి ఉండే ట్యూబ్‌కు వచ్చిన ఇన్‌ఫెక్షన్‌కు సర్జరీ విజయవంతంగా నిర్వహించామన్నారు. అలాగే సైనస్ ఇన్‌ఫెక్షన్, చెవిలో దిమ్ముగా ఉండటం, చిన్నపిల్లల్లో చెవిలో తరచుగా వచ్చే ఇన్‌ఫెక్షన్ జబ్బులకు బెలూన్ ట్యూబా ప్లాస్టీ సర్జరీ చక్కని ఫలితాలను ఇస్తుందన్నారు. ఈ ఆపరేషన్ వచ్చి కొన్నేళ్లు అవుతున్నా ఆ ఆపరేషన్ జిల్లాలో చేయటం ఇదే ప్రథమం అన్నారు. ఈ ఆపరేషన్‌లో డాక్టర్ కంజుల శ్రీవర్థిణి, డాక్టర్ విష్ణు రాజు, డాక్టర్ నరేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంగా ఉద్యోగ విరమణ చేయడం అదృష్టం



మహిళా హెడ్ కానిస్టేబుల్‌ను సత్కరిస్తున్న ఎస్పీ కె.శ్రీనివాసరావు

నరసరావుపేట రూరల్: సుదీర్ఘకాలం పోలీసు శాఖలో పనిచేసి సంపూర్ణ ఆరోగ్యంతో ఉద్యోగ విరమణ చెందడం అదృష్టమని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు. నరసరావుపేట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన కె.మంగమ్మ ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం జిల్లా ఎస్పీ కార్యాలయంలో గురువారం సాయంత్రం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు, అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) జేవీ సంతోష్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ వి. సత్తిరాజులు హాజరయ్యారు. ఉద్యోగ విరమణ చేస్తున్న మంగమ్మను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ పోలీసు శాఖలోకి ప్రవేశించి ఆహర్నిశలు ప్రజాక్షేమం కోసం పనిచేసి మర్యాద పూర్వకంగా పదవీ విరమణ పొందడం అదృష్టమని తెలిపారు. పదవీ విరమణ తరువాత కుటుంబ సభ్యులతో మిగిలిన శేష జీవితాన్ని సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. వెల్ఫేర్ ఆర్ఐ గోపినాథ్, డీసీఆర్‌బీ సీఐ ఎం.శ్రీనివాసరావు, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ సుభాషిణి, డీసీఆర్‌బీ ఎస్ఐ టి.మాణిక్యాలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కే-రిడ్జిలో ఎన్నికల ప్రక్రియపై అవగాహన



ఓటు హక్కును వినియోగించుకుంటున్న విద్యార్థులు

నరసరావుపేట ఈస్ట్: ఓటు వేసేందుకు బారులు తీరిన విద్యార్థి ఓటర్లు.. పోలింగ్ బూత్‌లో ప్రిసైడింగ్ అధికారితో పాటు ఇతర ఎన్నికల సిబ్బంది.. ఒక్కొక్క ఓటరు బూత్‌లోకి వెళ్లి రహస్య బ్యాలెట్ పద్ధతిలో తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం ఓట్ల లెక్కింపు.. ఓటింగ్ వివరాలు.. విజేతలను ప్రకటించిన ఎన్నికల అధికారి.. గుంటూరు రోడ్డులోని కే-రిడ్జి పాఠశాలలో గురువారం కనిపించిన దృశ్యమిది. పాఠశాల విద్యార్థి స్థాయి నుంచే విద్యార్థులకు ప్రజాస్వామ్య విలువలను తెలియచేసేలా ఎన్నికల పట్ల అవగాహన కలిగించేందుకు పాఠశాల హెడ్ బాయ్, హెడ్ గర్ల్, డిప్యూటీ హెడ్ బాయ్, డిప్యూటీ హెడ్ గర్ల్ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ఎన్నికల విధానాన్ని విద్యార్థులకు పరిచయం చేసేందుకు కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవరచుకోవటం, సమాజం పట్ల బాధ్యత గల పౌరులుగా మెలిగేందుకు ఇటువంటి కార్యక్రమాలు తోడ్పతాయని వివరించారు. కాగా, ఎన్నికల ప్రక్రియలో భాగంగా చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌గా టి.విజయరాజు, అసిస్టెంట్ ఎలక్షన్ కమిషనర్‌గా హేమలత, ఇతర పాఠశాల సిబ్బంది ప్రిసైడింగ్ అధికారులు, సిబ్బందిగా వ్యవహరించారు. పాఠశాల చైర్మన్ నాతాని, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, ప్రిన్సిపల్ బర్నబాస్, క్యాంపస్ ఇన్‌చార్జ్ కోట బాపూజీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకొని పర్యవేక్షించారు.

స్వమిత్వ సర్వే పారదర్శకతతో పూర్తి చేయాలి



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో ఉమాదేవి, ఎంపీపీ మేడం జయరామిరెడ్డి

నూజెండ్ల: గ్రామీణ ప్రాంతాల్లో భూవివాదాల సమస్యలకు స్వమిత్వ సర్వే పరిష్కారం చూపుతుందని ఎంపీడీవో పి.ఉమాదేవి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఇంజినీర్ అసిస్టెంట్లకు, విలేజ్ సర్వేయర్లుకు స్వమిత్వ సర్వేపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో ఉమాదేవి మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రతి ఇంటిని పూర్తి పారదర్శకతతో సర్వే చేయాలన్నారు. ఈ సర్వే ద్వారా గ్రామ కంటకం భూములను గుర్తించి గృహ యజమానులకు హక్కులు కల్పించటమే ముఖ్య ఉద్దేశ్యమన్నారు. భవిష్యత్‌లో ఇంటి యజమానులు ఆర్థిక ప్రయోజనాల కోసం బ్యాంకు నుంచి రుణాలు సులువుగా పొందవచ్చన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం 50 వేల గ్రామాల్లో స్వమిత్వ సర్వే చేపట్టారు. 65 లక్షల గృహ యజమానులకు ఎలక్ట్రానిక్ ఆస్తి ధృవ పత్రాలు అందించటం జరిగించన్నారు. అనంతరం ఎంపీపీ మేడం జయరామిరెడ్డితో కలిసి గ్రామంలో సిబ్బంది చేపడుతున్న సర్వే పనులు పరిశీలించారు. సర్వే చేపడుతున్న సిబ్బందికి సహకరించాలని గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, సర్వేయర్ చండీరాణి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల సర్వే పారదర్శకంగా పూర్తిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామయ్య

శావల్యాపురం: కేంద్ర ప్రభుత్వ సారథ్యంలో చేపడుతున్న ఇళ్ల సర్వే కార్యక్రమం పారదర్శకంగా చేయాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఇంజినీర్లు సర్వేయర్లు పంచాయతీ కార్యదర్శులకు సర్వే ప్రక్రియపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సీతారామయ్య మాట్లాడుతూ మండలంలోని కనమర్లపూడి, శానంపూడి, కొత్తలూరు, కారుమంచి, వేల్పూరు, పోట్లూరు ఆరు రెవెన్యూ గ్రామాల్లో ఇళ్లను ఖాళీ స్థలాలను రోవర్ యంత్ర పరికరం ద్వారా సాంకేతిక పరిజ్ఞానంతో కొలతలు తీసి సంబంధిత యాజమాని సమగ్ర వివరాలు సేకరించి ఆన్‌లైన్ నమోదు చేయాలన్నారు. డాక్యుమెంట్లు తగిన ఆధారాలు చూపని లబ్ధిదారులకు సంబంధించి గ్రామపెద్దల సమక్షంలో విచారణ చేసిన అనంతరం వారి వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. ఈకార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ పి.సుగుణ, మండల సర్వేయర్ రవికుమార్, మాస్టర్ ట్రైనర్ సర్వేయర్ సలీమ్, తదితరులు పాల్గొన్నారు.

సీఈవో పదవీ విరమణ

రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సీఈవోగా పనిచేస్తున్న కనకా శివారెడ్డి గురువారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామంలోని జీడీసీసీ బ్యాంక్ కార్యాలయంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు విధి నిర్వహణలో అన్ని విధాల సహకరించిన సొసైటీ బ్యాంక్ ఉద్యోగులకు రుణపడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ మిరియాల కోటేశ్వరరావు, సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, సీఈవోలు వెంకటేశ్వరరెడ్డి, వీరారెడ్డి, లక్ష్మీరెడ్డి, దీపక్, వెంకటేశ్వరరెడ్డి, యూనియన్ నాయకులు డి.శ్రీనివాసరావు, జె. నాగప్రసాద్, వై. నారాయణ, లక్ష్మీనారాయణ, కంటు శ్రీనివాసరావు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ నాగేశ్వరరావు ఉద్యోగ విరమణ



నరసరావుపేట టౌన్: నరసరావుపేట డీఎస్పీ కె. నాగేశ్వరరావు గురువారం ఉద్యోగ విరమణ పొందారు. 2015 నుంచి 2018 వరకు గతంలో నరసరావుపేట డీఎస్పీగా నాగేశ్వరరావు సుదీర్ఘ కాలం పనిచేశారు. ఇక్కడి నుంచి బదిలీపై సీఐడీతో పాటు పలు విభాగాల్లో డీఎస్పీగా పనిచేశారు. గత ఏడాది ఆగస్టు నెలలో తిరిగి నరసరావుపేట డీఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన స్థానంలోనే రెండవ సారి డీఎస్పీగా పనిచేసిన పేరును దక్కించుకున్నారు. పదవీ విరమణను పురస్కరించుకొని వీడ్కోలు పలుకుతూ పల్నాడు సబ్‌డివిజన్‌లోని పోలీస్ అధికారులు శుక్రవారం సన్మానం చేయనున్నారు.

వ్యవసాయంలో సాంకేతికతను పెంపొందించాలి

నరసరావుపేట రూరల్: రైతులు ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకొని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. మండలంలోని ఇక్కుర్రు గ్రామంలోని రామన్న కిసాన్ డ్రోన్ గ్రూప్‌కు రూ.9.8 లక్షల విలువైన డ్రోన్‌ను 80 శాతం సబ్సిడీపై మంజూరు చేశారు. గ్రామంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో డ్రోన్‌ను రైతుల గ్రూపుకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అందజేశారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ పూనాటి శ్రీనివాస రావు, సహాయ వ్యవసాయ సంచాలకులు కె.వి.శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి ఐ.శాంతి. గ్రామ రైతులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడి పర్యటన విజయవంతం చేయండి

నరసరావుపేట: ఈనెల నాల్గవ తేదీన నిర్వహించే భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ జిల్లా పర్యటను జయప్రదంచేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. గురువారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఏలూరి శశికుమార్ పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులుగా మాధవ్ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఒక చేత పార్టీ జెండా, మరోచేతో ఎన్‌డీఏ అజెండా చేతబూని రాష్ట్ర వ్యాప్తంగా సారథ్యం పేరుతో నిర్వహిస్తున్న పర్యటనలో భాగంగా జిల్లా పర్యటనకు వస్తున్నారన్నారు. నాల్గవ తేదీ ఉదయం నుంచి చాయ్ పే చర్చ, శోభాయాత్ర, కార్యకర్తలతో సమావేశం, పత్రిక మిత్రులతో ఇష్టాగోష్ఠి, వివిధ వర్గాలకు చెందిన వృత్తులు, మేధావులతో సమావేశం వివిధ కార్యక్రమాలలో పాల్గొంటారన్నారు. కావున పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జాతీయ కౌన్సిల్ మెంబర్ వల్లెపుకృపారావు, నాయకులు కృష్ణమోహన్, ఇత్తడి కిరణ్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభాపాటవాలు వెలికి తీయాలి



చిలకలూరిపేట: విద్యార్థుల్లోని ప్రతిభా పాటవాలు వెలికి తీసేలా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. పట్టణంలోని ఆర్‌వీఎస్ సీవీఎస్ హైస్కూల్‌లో రూ. 50 లక్షలు ఎంపీ నిధులతో నిర్మించనున్న తరగతి గదుల నిర్మాణ పనులను పంచాయితీ రాజ్‌శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణతేజతో కలసి గురువారం శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరళతరమైన విధానాలతో విద్యార్థులకు అన్ని విషయాలు అర్థమయ్యేలా విద్యాబోధన గావించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ షేక్ కరిముల్లా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంబూషియా చేపలు వదలిన అధికారులు



వల్లప్పచెరువులో గంబూషియా చేపలను వదులుతున్న వైద్యాధికారులు

నరసరావుపేట: జిల్లాలో దోమల నివారణకు వైద్య శాఖాధికారులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా గురువారం పట్టణ శివారు వల్లప్ప చెరువులో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవి, జిల్లా మలేరియా అధికారి కె.రవీంద్ర రత్నాకర్ తమ సిబ్బందితో కలిసి గంబూషియా చేపలను వదిలి, జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. రెండు లక్షల గంబూషియా చేపలను పొన్నూరు మండలం నిడుబ్రోలు ఫిషరీస్ డిపార్టుమెంట్ నుంచి సేకరించి జిల్లాలోని అన్ని సబ్ యూనిట్లకు అందజేశామన్నారు. దోమలు ఒకసారి 100 నుంచి 150 వరకు గుడ్లు పెడతాయని, లార్వా, ప్యూపా దశలను దాటి దోమగా మారడానికి ఏడు నుంచి పది రోజులు పడుతుందన్నారు. ఈ గంబూషియా చేపలు లార్వాలు దోమలుగా పెరగకముందే లార్వాలను ఆహారంగా తీసుకోవటం వలన దోమల ఉత్పత్తిని తగ్గిస్తాయని పేర్కొన్నారు. వీటిని బావులు, చెరువులు, నీరు ఎక్కువ కాలం నిలువ ఉండు నీళ్లలోనూ వేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని అన్నీ యూనిట్ల ద్వారా ఆయా ప్రాంతాల్లో గంబూషియా చేపలను వదలటం జరిగిందన్నారు. ఏఎంఓ కుంచాల శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ వెంకటేశ్వరు పాల్గొన్నారు.

గంబూసియా చేపలతో దోమల నివారణ

యడ్లపాడు: మలేరియా, డెంగ్యూ వంటి ప్రాణాంతక వ్యాధులకు అడ్డుకట్ట వేసేందుకు అధికారులే కాదు ప్రజల సహకారం కూడా తప్పనిసరి యడ్లపాడు వైద్యాధికారి డాక్టర్ పి.భరద్వాజ చెప్పారు. గురువారం పలు గ్రామాల్లో దోమల పెరుగుదలను నియంత్రించడంలో కీలకపాత్ర పోషించే గంబూసియా చేపల పిల్లలను మండలంలోని వివిధ చెరువులు, బావుల్లో వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గంబూసియా చేపలు నీటిలో పెరిగే దోమల లార్వాలను ఆహారంగా తీసుకుంటా యి. తద్వారా దోమల సంతతిని పెరగకుండా అరికట్టి, మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా నివారిస్తాయి. దోమల బెడద తగ్గడంతో పాటు, సీజనల్ వ్యాధుల బారి నుండి కూడా విముక్తి లభిస్తుందన్నారు. ప్రజలకు యడ్లపాడు, మైదవోలు, జగ్గాపురంల్లో జరిగిన ఈ కార్యక్రమంలో మండల సామాజిక ఆరోగ్య అధికారి ఎస్.పున్నారావు, ఆరోగ్య పర్యవేక్షకులు వి.రాజశేఖర్, రిజ్వాన్‌బాషా పర్యవేక్షించారు.

రామ్‌రాజ్ కాటన్ షోరూం ప్రారంభం



షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట రూరల్: ప్రముఖ వస్త్ర తయారీ కంపెనీ రామ్‌రాజ్ కాటన్ తన నూతన షోరూమ్‌ను నరసరావుపేటలో గురువారం ప్రారంభించింది. పట్టణంలోని మోర్‌సెంటర్ అరండల్‌పేటలో ఏర్పాటుచేసిన నూతన షోరూంను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ప్రారంభించారు. జ్యోతిప్రజల్వన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. మొదటి కొనుగోలును ఏపీ రెడ్డి జేఏసి గౌరవ అధ్యక్షుడు పోలిమేర వెంకటరెడ్డి చేశారు. రామ్‌రాజ్ కాటన్ వ్యవస్థాపకులు, చైర్మన్ కేఆర్ నాగరాజన్ కార్యక్రమానికి హాజరయ్యారు. నాగరాజన్ మాట్లాడుతూ బ్యాక్టీరియా, వైరల్ ఇన్ఫెక్షన్ల నుంచి కాపాడుకునేందుకు రామ్‌రాజ్ నూతనంగా యాంటీ బాక్టీరియల్ ధోవతీలు అందుబాటులోకి తీసుకువచ్చినట్టు తెలిపారు. రామ్‌రాజ్ కాటన్ ఉత్పత్తులైన ధోతీలు, చొక్కాలు, బనియన్లను మృదువైన కాటన్‌తో తయారు చేస్తున్నట్టు తెలిపారు. దక్షిణ భారతదేశంతో పాటు దేశవ్యాప్తంగా ధోవతీల అమ్మకాలలో రామ్‌రాజ్ కాటన్ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని దక్కించుకుందని వివరించారు. నాణ్యత, సాంప్రదాయ దుస్తులకు రామరాజ్ అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ప్రతి ఏటా అమ్మకాల వృద్ధి 25 శాతంగా ఉందని పేర్కొన్నారు. దక్షిణ భారతదేశంలోని ప్రధాన నగరాలతో పాటు విమానాశ్రయాలలో షోరూమ్‌లను ప్రారంభిస్తున్నట్టు తెలిపారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం



పద్మావతిని సన్మానిస్తున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

నాదెండ్ల: సుదీర్ఘ కాలంలో ఎన్నో ఉన్నత పాఠశాలల్లో ఆదిరాల పద్మావతి ఇంగ్లీష్ టీచర్‌గా పనిచేసి ఎంతోమంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్ది వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేశారని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ టీచర్‌గా పనిచేస్తున్న ఆదిరాల పద్మావతి గురువారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా పద్మావతి దంపతులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 36 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావంతో పనిచేసి వేలాది మంది విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దారన్నారు. రాష్ట్ర ఎన్జీవోస్ సంఘం అధ్యక్షుడు, ఏపీ రెవెన్యూ అసోసియేషన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదని, సుదీర్ఘ కాలం తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన పద్మావతి అభినందనీయురాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఐ కృష్ణానాయక్, సత్యనారాయణ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర నూరుబాషా యువజన సంఘం ఉపాధ్యక్షుడిగా కొటికలపూడి



నియామక పత్రం అందుకుంటున్న కొటికలపూడి శ్రీను

రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల గ్రామానికి చెందిన కొటికలపూడి శ్రీను రాష్ట్ర నూరుబాషా యువజన సంఘం వైస్ ప్రెసిడెంట్‌గా ఎంపికయ్యారు. ఇటీవల బాపట్ల జిల్లా అద్దంకిలో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఎంపికైనట్లు శ్రీను గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తనకు పదవి ఇచ్చిన నూరు భాష యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డీపీ మస్తాన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నూరు భాషా యువజన సంఘం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. తనకు పదవి రావడానికి సహకరించిన యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి ఖాశిం సైదా, ఆర్గనైజింగ్ సెక్రటరీ దూదేకుల దావూద్, రాష్ట్ర అధ్యక్షుడు పీర్ మహ్మద్, కార్యదర్శి సలీం, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మస్తానమ్మకు కృతజ్ఞతలు తెలిపారు.